భక్తులతో కిటకిటలాడుతున్న దేవునికడప వెంకటేశ్వరుని ఆలయం



కొంగొత్త ఆశలతో..

కడప (కల్చరల్), జనవరి 1: నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు కొంగొత్త ఆశలతో స్వాగతం పలికారు. పాత గాయాలు చెరిపివేస్తూ భవిష్యత్తుపై ఆశలు పెంచుకుంటూ 2024 ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికారు. ముఖ్యంగా యువత బాగా సందడి చేశారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి సరిగ్గా 12గంటలు కాగానే యువత బైకులతో నగరంలో ఫుల్ జోష్‌తో రోడ్లపైన తిరుగుతూ కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆ మేరకు హోటళ్లు, లాడ్జిలు కూడా నూతన వేడుకలకు కేంద్రాలయ్యాయి. 12గంటలు కాగానే ఆత్మీయుల నడుమ కేక్ కట్ చేసి వీధుల్లోకి వచ్చి సందడి చేశారు. ఇక సోమవారం ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. జనవరి 1వ తేదీన దేవుని దర్శిస్తే ఏడాదంతా శుభాలు కలుగుతాయనే నమ్మకంతో ఆలయాలకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. మరోవైపు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హార్సిలీహిల్స్ .కిటకిట

- వేలాదిగా తరలివచ్చిన పర్యాటకులు
- న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతం

బి.కొత్తకోట, జనవరి 1: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ కిటకిటలాడింది. నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకునేందుకు సోమవారం పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. డిసెంబరు 31న గెస్ట్‌హౌస్‌లు బుక్ చేసుకున్న పర్యాటకులు ఆయా గెస్ట్‌హౌస్‌ల ఎదుట బహిరంగ ప్రదేశాల్లో చల్లటి వాతావరణంలో క్యాంప్ ఫైర్ వేసి నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. సోమవారం ఉదయం జనవరి 1న వేలాది మంది కుటుంబీకులు, స్నేహితుల బృందాలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హార్సిలీహిల్స్‌కు తరలివచ్చారు. మానస సరోవరంలో బోటింగ్ చేశారు. గాలిబండ, వ్యూపాయింట్‌ల ద్వారా 4500 అడుగులు కింది భాగంలో ఉన్న చుట్టు పక్కల ప్రాంతాలను వీక్షిస్తూ ఫొటోలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పర్యాటకుల రద్దీని ముందుగానే ఊహించిన అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. మదనపల్లె డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడిపి, రద్దీకి తగ్గ రవాణా సౌకర్యం కల్పించారు. హిల్స్‌పై రెస్టారెంట్లు కిటకిటలాడాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలను పైకి అనుమతించకపోవడంతో ఘాట్ రోడ్డులో యువకులు, ఆకతాయిల అల్లర్లకు అవకాశం లేకుండాపోయింది. బహిరంగ మద్యపానాన్ని ఏమాత్రం అనుమతించకపోవడంతో కుటుంబంతో వచ్చిన పర్యాటకులు ప్రశాంతంగా పర్యటన ముగించుకుని వెళ్లారు. డీఎస్పీ కేశప్ప, బి.కొత్తకోట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌ల పర్యవేక్షణలో సుమారు 50 మంది పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా న్యూ ఇయర్ వేడుకలు హార్సిలీహిల్స్‌లో ప్రశాంతంగా ముగిశాయి.



హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రద్దీ

గుటగుటా..

(కడప-ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వస్తోందంటే డిసెంబరు 31న ఉండే క్రేజే వేరు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అర్ధరాత్రి వరకూ మేల్కోవడం, విందులు, వినోదాలు ఏర్పాటు చేయడం ఎక్కువగా ఉంటుంది. ఇక ఆ విందు వినోదాలకే ఒక్క రోజు పెట్టే ఖర్చు కోట్లల్లో ఉంటుంది. ఒక్క రోజే సుమారు రూ.10 నుంచి రూ.15 కోట్ల దాకా ఖర్చయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్క రోజే జిల్లావ్యాప్తంగా రూ.6.90 కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. గుటగుటా తాగేశారు. ఇక చికెన్, మటన్ కేక్‌లు ఇతరత్రా వాటిని కలుపుకుంటే డిసెంబరు 31వ తేదీ అయిన ఖర్చు రూ.10 కోట్లు పైమాటే.







- మందు విందుతో యువత జోష్
- నూతన సంవత్సరానికి స్వాగతం
- రూ.6.90 కోట్ల మద్యం విక్రయాలు
- లక్ష కిలోల చికెన్ హాంఫట్
- రూ.2 కోట్ల కేక్ బిజినెస్
- ఒక్కరోజులో తాగితిన్న ఖర్చు రూ.10 కోట్లకు పైగానే

సమయం పెంచి మరీ అమ్మకాలు

నూతన సంవత్సరానికి ఉన్న క్రేజ్ క్యాష్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాల సమయం పెంచింది. మామూలుగా రాత్రి 9గంటలకు మద్యం దుకాణాలు మూసేస్తారు. అయితేఏ డిసెంబరు 31 రోజున మాత్రం రాత్రి 12గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచే ఉంచడంతో మందు అమ్మకాలు ఎక్కువగా సాగాయి. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు ఎక్సైజ్ డిపోలున్నాయి. కడప డిపో పరిధిలో 104 ప్రభుత్వ మద్యం షాపులు, 18 బార్లు ఉండగా ఇక్కడ 2,070 మద్యం కేసులు, 1,290 బీరు కేసులు అమ్ముడుపోయాయి. వీటి విలువ రూ.3.30 కోట్లు. ఇక ప్రొద్దుటూరు పరిధిలో 84 బ్రాందీషాపులు, పది బార్లు ఉన్నాయి. ఇక్కడ లక్షా 63వేల 590 బాటిళ్ల మద్యాన్ని లాగేశారు. 17,072 బీర్ సీసాలను చల్లగా తాగేశారు. వీటి విలువ రూ.3.59 కోట్లు. అంటే ఒక్క మద్యానికే సుమారు రూ.6.90 కోట్లు ఖర్చు చేశారు. ఇక బార్లలో జరిగిన విక్రయాలు కలుపుకుంటే రూ.7కోట్లు పైమాటే అని చెబుతారు.

నంజుకు తిన్నారు

అసలే డిసెంబరు 31. అందులో ఆదివారం.. ఇంకేముంది మద్యంబాబులు మందులోకి చికెన్ మటన్ మంచింగ్‌తో మజా చేసుకున్నారు. మేమేం తక్కువ అంటూ మద్యం అలవాటు లేని వారు కూడా నాన్‌వెజ్ బాగా ఆరగించారు. వెరసి జిల్లావ్యాప్తంగా లక్ష కిలోల చికెన్ ఆరగించినట్లు చెబుతున్నారు. వీటికి అదనంగా మటన్, చేపలు, గుడ్లు విక్రయాలు జరిగాయి. కడపలోని అన్నిరకాల చికెన్ షాపులు కలుపుకుని 150కి పైగా ఉన్నాయి. ఇక్కడ 15 నుంచి 20 వేల కిలోల చికెన్ విక్రయాలు జరిగినట్లు చెబుతున్నారు. కిలో చికెన్ రూ.180 చొప్పున విక్రయించారు. ఇక ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు, పోరుమామిళ్ల, కమలాపురం ఇతర ప్రాంతాల్లో కలుపుకుంటే పెద్ద ఎత్తున మాంసం అమ్మకాలు జరిగాయి. ఇక పల్లెల్లో ఇళ్ల వద్ద పెంచుకున్న నాటుకోళ్లు, మొత్తం మాంసం విక్రయాలు చూస్తే 1.20 లక్షల కిలోలకు తక్కువ కాకుండా అమ్మకాలు సాగినట్లు చెబుతారు. అంటే రూ.2 కోట్లకుపైగా వీటి విక్రయాలు సాగాయి. దీనికి తోడు ఈ సారి హోటల్ బిజినెస్ సైతం భారీగా సాగింది.

కెవ్వు కేకు

మద్యం చికెన్ విక్రయాలకు దీటుగా కేకులు కూడా కెవ్వుమనే రేంజ్‌లో అమ్మకాలు సాగాయి. నూతన సంవత్సరాన్ని ఆస్వాదిస్తూ అర్ధరాత్రి పూట కొందరు కేకులు కట్ చే స్తే మరికొందరు సోమవారం కట్ చేశారు. కడపలో ప్రత్యేక కేక్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఓ ప్రధాన కేక్‌ల తయారీ చోటనే రూ.10 లక్షల పైన బిజినెస్ జరిగినట్లు చెబుతారు. జిల్లావ్యాప్తంగా రూ.2 కోట్ల మేర కేకుల అమ్మకాలు సాగినట్లు అంచనా వేస్తున్నారు.



మాట్లాడుతున్న బీటెక్ రవి



పనులన్నీ నాశిరకమే..!

- రూ.1000కోట్లతో పరిశ్రమలు కట్టవచ్చు
- పులివెందులలో పనులతీరుపై బీటెక్ రవి ధ్వజం

పులివెందుల టౌన్, జనవరి 1: పులివెందుల పట్టణంలో అభివృద్ధి పనులన్నీ నాశిరకంగా జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2014, 2019లో రైతులు నీళ్ల కావాలని అడిగితే హెచ్ఎల్‌సీ నుంచి ఒకటిన్నర టీఎంసీ నీళ్ల ఇచ్చి రైతులను ఆదుకున్న ఘనత టీడీపీదే అన్నారు. అభివృద్ధి అంటే కట్టడం పగలగొట్టడం కాదన్నారు. ఇండస్ట్రీ పెడితే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో దాదాపు రూ.1,000కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. అదే రూ.1000కోట్లతో పరిశ్రమలు కట్టి ఉంటే నిరుద్యోగ సమస్య ఉండేది కాదన్నారు. ఊర్లో విగ్రహాలు పగలగొట్టడం, కట్టడంకోసం కోట్ల రూపాయలు డబ్బులు వృథా చేస్తున్నారన్నారు. పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయన్నారు. రూ.175కోట్లతో గరండాల వంకలో బోటింగ్ ఏర్పాటుచేశారని, యర్రబల్లె చెరువుకు నీరు వస్తే ఆ బోటింగ్ నిలబడుతుందా అని ప్రశ్నించారు. కొత్తగా కడుతున్న పాత సంతమార్కెట్‌లో రూముల వద్ద ర్యాంపు బాగా ఎత్తుగా వేశారని దీనిని ప్రశ్నిస్తే వాటిని ఇప్పుడు పగలగొడుతున్నారన్నారు. అదంతా ప్రజాధనం దుర్వినియోగం చేయడమే అన్నారు. వివేకానందరెడ్డి మంత్రిగా ఉన్న 2010, 2011లో కొత్త బిల్డింగులు కట్టినపుడు ఆయన ప్రారంభించారన్నారు. 12 సంవత్సరాలకే ఆ రూములు పాతబడిపోయాయా అని ప్రశ్నించారు. రూ.1,000 కోట్లు దేనిపై ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి రూపాయిపై విచారణ జరుగుతుందన్నారు. అంతకుముందు నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, శివమోహన్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, రాముమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న దృశ్యం

ఊరంతా పండగ.. మాకంతా చీకటి

- జనవరి 1వ తేదీనా..
- అంగన్వాడీలకు తప్పని ఆందోళన

(కడప-ఆంధ్రజ్యోతి): "ఊరంతా వెన్నెల.. మనసంతా చీకటి" అంటూ ఓ పాట ఉంది. అంగన్వాడీల పరిస్థితి ప్రస్తుతం ఇలానే ఉంది. మూడు వారాలుగా సమ్మెలోకి వెళ్లి, తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా జగన్ ప్రభుత్వం స్పందించడం లేదు. జనవరి 1వ తేదీ కావడంతో జిల్లా ప్రజలందరూ మాంచి జోష్‌లో ఉన్నారు. కొత్త బట్టలు, చికెన్ బిర్యానీలు, విందులు వినోదాల్లో మునిగిపోయారు. తమ చుట్టూ పండగ వాతావరణం నెలకొన్నా అంగన్వాడీల్లో మాత్రం చీకటి తొలగలేదు. వీరు ఆందోళనలు కొనసాగించక తప్పలేదు. అయితే కొన్నిచోట్ల ఆటపాటలతో నిరసన తెలపడం విశేషం.

సమ్మెలో భాగంగా అంగ్వాడీలు 21వ రోజైన సోమవారం మైదుకూరులో దీక్షా శిబిరం వద్ద కోలాటం ఆడి నిరసన తెలిపారు. జగనన్నా.. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయన్నా అంటూ పాటలు పాడారు. కొండాపురంలో దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు చేతుల్లో జగన్ చిత్ర పటాలను పట్టుకుని ఆటాపాటలతో నిరసన తెలిపారు. బద్వేలులో ఒంటికాలి జపం చేశారు. పోరుమామిళ్లలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. జమ్మలమడుగులో ఆందోళన సాగించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ఏడోరోజుకు చేరుకుంది. వీరు తమ ఆందోళనలో భాగంగా బద్వేలులో చెప్పులు కుట్టి నిరసన తెలిపారు.




కొండాపురంలో జగన్ చిత్రపటాలతో అంగన్వాడీల ఆటపాటలు



మైదుకూరులో కోలాటంతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



బద్వేలులో చెప్పులు కుట్టి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



ఆ సార్ సపరేటు

కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో భూముల సబ్‌డివిజన్‌కు సంబంధించి ఫైళ్లు క్లియర్ చేస్తున్న అధికారి పేరు వింటేనే అటు రైతులు ఇటు సర్వేయర్లు బెంబేలెత్తుతున్నారు. ఫైలు ఆయన వద్దకు పోతే దానికి ఎంత డిమాండ్ చేస్తారో అనే భయం వారిలో ఉంది. డబ్బులు ఇవ్వకపోతే ఫైళ్లను పెండింగులో పెడతారంటారు. చెప్పిన రేటు ఫిక్స్ చేసుకోకపోతే మీరు పనికి రారంటూ కింది స్థాయి సర్వేయర్‌పై ఆయన చిందులు తొక్కుతారు. దీన్ని చూసి ఆయన వద్దకు ఫైలు పోయిందంటేనే సర్వేయర్లు వణికే పరిస్థితి వచ్చిందంటారు.

- భూమి సబ్‌డివిజన్ ఫైలు వస్తే చాలు.. ఆమ్యామ్యాలే
- భూమి విలువ బట్టి రేటు
- ప్రత్యేక టీం ఏర్పాటు
- కేటాయించిన మండలాలు కాకుండా అన్నింటిలోనూ జోక్యం
- డబ్బు ఇవ్వకపోతే ఫైళ్ల క్లియరెన్స్‌కు బ్రేక్
- ఇదీ రెవెన్యూలో ఓ అధికారి తీరు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప రెవెన్యూ డివిజను పరిధిలో కడప, సీకేదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి, కమలాపురం, ఖాజీపేట, చెన్నూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో భూములుంటాయి. భూముల సబ్ డివిజను, సర్వేకు సంబంధించి తహసీల్దారు కార్యాలయం నుంచి కడప ఆర్డీవో కార్యాలయానికి ఫైళ్లు వస్తుంటాయి. వాటిని క్లియర్ చేయాల్సి ఉంది. వీటిని క్లియర్ చేసే బాధ్యతను రెవెన్యూ డివిజన్‌లో ముగ్గురికి కేటాయించారు. వారికి కేటాయించిన మండలాల్లోనే భూముల సర్వేకు సంబంధించి ఆ అధికారులు ఫైళ్లు పరిశీలించి క్లియర్ చేయాల్సి ఉంది.

ఫైలు బట్టి రేటు

రెవెన్యూ డివిజన్ పరిధిలో భూవివాదాలు, క్రయ విక్రయాలు ఉన్నప్పుడు సర్వేనెంబరు సబ్ డివిజన్ కోసం ఫైలును ఆయా తహసీల్దారు కార్యాలయం నుంచి పంపిస్తుంటారు. అయితే ఈ అధికారి వద్దకు ఫైలు వచ్చిందంటే సర్వేయర్లకు మూడినట్లే. ఎందుకంటే ఆయన చెప్పిన రేటు ఇస్తేనే ఫైలు ముందుకు కదిలిస్తారని చెబుతారు. లేకపోతే ఫైలు పెండింగులో పెట్టుకుంటారంటారు. సర్వేనెంబరు సబ్ డివిజను అయితే భూమి విలువ బట్టి ఎకరాకు రూ.20వేలకు పైగానే వసూలు చేస్తారని చెబుతారు. ఆయన చెప్పిన డీల్ కుదుర్చుకోకపోతే గ్రామ సర్వేయర్లను చాలా చులకనగా మాట్లాడడం, మీరు పనికిరారు, వెళ్లిపోండంటూ బెదిరించడం చేస్తారని ప్రచారం ఉంది.

ప్రత్యేక టీం ఏర్పాటు

కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో సర్వే సబ్‌డివిజన్‌కు సంబంధించి ముగ్గురు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అయితే ఈ అధికారి మాత్రం మిగతా వారికి కేటాయించిన వాటిల్లో కూడా జోక్యం చేసుకుని డీల్ చేస్తారని ప్రచారం ఉంది. సబ్ డివిజన్ లేదా క్రయవిక్రయాల్లో మార్పుల కోసం తహసీల్దారు కార్యాలయం నుంచి ఫైలు వస్తే సర్వేయర్లు ఈయనను ముందుగా కలవకూడదంటారు. ఈయన ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న టీంను కలవాలని చెబుతారు. ఈయన ఎర్రముక్కపల్లెలో ఓ ఐదుగురితో ఓ ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చెబుతారు. ఫైలు వచ్చిన వెంటనే ఆ డిటెయిల్స్ వారికి చేరుతాయంటారు. ఫైలు పంపిన సర్వేయర్లు ముందు ఆ ప్రైవేటు సైన్యాన్ని కలవాల్సి ఉందంటారు. వారు అప్పటికే ఆ భూమి ఎక్కడుంది, దాని రేటు ఎంత తదితర వివరాలన్నీ తెలుసుకుని ఓ రేటు ఫిక్స్ చేసి ఉంటారు. ఆ మేరకు సదరు సర్వేయర్ అక్కడ ఆమ్యామ్యాలు ముట్టచెప్పాల్సి ఉందంటారు. ఈమేరకు ముడుపులు వసూలు చేయలేక సర్వేయర్లు పడరాని పాట్లు పడుతున్నారని చెబుతారు. చేయి తడపకపోతే ఫైలు నెలల తరబడి పెండింగులో ఉంటుందంటారు. డీల్ ఒకే అయితే ఫైలు క్లియర్ అయిపోతుంది. సారు దర్శనం ఆఫీసు పనివేళల్లో కాకుండా సాయంత్రం 6 గంటలు దాటాకే దొరుకుతుందని చెబుతారు.

బెదిరింపులు

సర్వే డిపార్ట్‌మెంటులో కూడా ఈయన జోక్యం చేసుకుంటారంటారు. ఓ అధికారితో ఉన్న సంబంధం కారణంగా సర్వేయర్లపై పెత్తనం చెలాయిస్తాడన్న ప్రచారం ఉంది. ఈయన డీల్‌కు ఒప్పుకోని వాళ్లను ట్రాన్స్‌ఫర్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడతారని అంటారు.

ఇటీవల ప్రభుత్వం పేదల పేరిట ఇచ్చిన భూపంపిణీలో ఈయనకు కాసులు కురిసినట్లు ప్రచారం ఉంది. మొత్తానికైతే ఈ సారు వ్యవహారం కడప రెవెన్యూ డివిజన్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

రెండు బైకులు ఢీ... ఒకరు మృతి


మృతి చెందిన గంగాధర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, జనవరి 1: మండలంలోని వై.కోడూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం అర్ధరాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో వై.కోడూరుకు చెందిన రామిరెడ్డి గంగాధర్‌రెడ్డి (35) మృతి చెందాడు. ఆదివారం అర్ధరాత్రి రామిరెడ్డి గంగాధర్ రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలు పెద్దనపాడు గ్రామం నుంచి వై.కోడూరుకు వస్తున్నారు. అదే సమయంలో ఎర్రగుంట్ల నుంచి వీరాంజినేయరెడ్డి బైకులో వై.కోడూరుకు వస్తున్నారు. రెండు బైకులు వై.కోడూరు క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గంగాధర్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆసుపత్రికి తరలించగా గంగాధర్ రెడ్డి చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. అర్బన్ సీఐ ఈశ్వరయ్య కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఎర్రగుంట్ల, జనవరి 1: చిలమకూరుకు ఎం.మానస(22) అనే వివాహిత సోమవరం తెల్లవారుజామున ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు... మానస భర్త నాగేష్ కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల మానసకు కడుపునొప్పి అధికమైందని, నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి


మృతి చెందిన దస్తగిరి

సికెదిన్నె, జనవరి 1: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో దస్తగిరి (61) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. కడప నుంచి పెండ్లిమర్రికి వెళుతున్న ఆటో కొప్పర్తి సమీపంలోని రేడి యో స్టేషన్ వద్ద కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దస్తగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ గాయపడటంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలకు పాతర

- ఆర్టీసీ టెండర్ల జీఎస్టీ బిల్లులు చెల్లింపుల ఎగవేత
- అన్నీ సవ్యంగా ఉన్నా.. దాటవేత ధోరణి
- కుంటి సాకులు చెబుతున్న సంబంధిత ఏవో
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

కడప (మారుతీనగర్), జనవరి 1: అది ఘనత వహించిన ఏపీఎస్ ఆర్టీసీ. నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేవేసే సంస్థగా ప్రజల విశ్వాసాన్ని చూరగొంది. కాగా ఆర్టీసీకి చెందిన బస్టాండ్లు, గ్యారేజీలు, ఆర్ఎం ఆఫీసు, డీఎంఆఫీసు, ఈడీ ఆఫీసు, అద్దె బస్సులు, రిజర్వేషన్ కౌంటరు, గ్యారేజీ బస్సుల క్లీనింగ్ తదితర విభాగాల్లో టెండర్ల ద్వారా అవుట్ సోర్సింగ్ కార్మికులను నియమించుకునేందుకు వీలుగా టెండర్లు వేయడం పరిపాటి. అందుకు వీలుగా ఏ క్లాస్, బిక్లాస్, త్రీ క్లాస్ కేటగిరిలుగా టెండర్లకు కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తుంటారు. ఆర్టీసీలో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ టెండర్ల ద్వారా 18 శాతం జీఎస్టీ (గూడ్సు అండ్ సర్వీసు ట్యాక్స్) విధిగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా ఆ ఇన్‌పుట్ జీఎస్టీని టెండరుదారులకు జీఎస్టీ ఉన్నప్పటికీ వారికి ఇవ్వడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కడప రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోలలో ఒకసారి ఆర్టీసీకి చెందిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు టెండర్లు జరిగితే కనీసం 700 నుంచి 800 దరఖాస్తులు వస్తుంటాయి. వాటిపై వసూలు చేసే 18 శాతం జీఎస్టీని టెండరుదారులకు జీఎస్టీ తాలుకూ రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ వారికి ఇవ్వకుండా ఆర్టీసీకే జమ చేస్తున్నట్లు సమాచారం. ఈ తంతు 2017 నుంచి నడుస్తున్నట్లు పలువురు టెండరుదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉదాహరణకు ఏ క్లాస్ కింద కడప డిపో, బి క్లాస్ కింద పులివెందుల, మైదుకూరు, బద్వేలు డిపోలు, సిక్లాస్ కింద ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోలు వర్తింపజేస్తున్నారు. ఆ మేరకు ఏ క్లాస్ (అవుట్‌సోర్సింగ్, స్టాల్స్) ద్వారా ఒక్కో దరకాస్తుకు రూ.1500తో పాటు అదనంగా జీఎస్టీ కింద 18 శాతం అంటే రూ..270 మొత్తంగా రూ.1770 వసూలు చేస్తున్నారు. అలాగే బి క్లాస్ (ఇన్‌కం సోర్సింగ్ యూనిట్స్) కింద ఒక్కో దరఖాస్తుకు రూ.750 18శాతం జీఎస్టీ కింద అదనంగా రూ.135 మొత్తం రూ.885, సిక్లాస్ కింద దరఖాస్తుకు రూ.250, జీఎస్టీతో కలిపి మరో 45 మొత్తం రూ.295 సంస్థకు చేరుతుంది. అలా ఒక్కో టెండరు నోటిఫికేషన్‌కు సుమారు వెయ్యికి పైగా దరఖాస్తులు అందుతున్నట్లు సమాచారం. ఆ లెక్కన సుమారు రూ.5లక్షల నుంచి 6 లక్షల వరకు జీఎస్టీ కింద ఆర్టీసీ దండుకున్నట్లు తెలుస్తోంది.

కాంట్రాక్టరు బిల్లుతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ చెల్లించినా దానికి సంబంధించిన జీఎస్టీ ఆర్-1, జీఎస్టీ ఆర్-3బి చెల్లించి జత పరిచినప్పటికీ ఆన్‌లైన్‌లో కనిపించడంలేదన్న సాకుతో కడప రీజియన్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయం కాంట్రాక్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలుసార్లు సంబంధిత పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. అయినప్పటికీ ఆ ఏవో పైస్థాయి అధికారుల ముందు జీ హుజూర్ అంటూ తరువాత జాన్తానై.. అంటూ జీఎస్టీ తాలుకా జీవో అమలు చేసే విషయంలో ఆర్టీసీ నిబంధనకు పాతర వేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఏదేని బిల్లులో తప్పు ఒప్పులు ఉన్నా.. అందుకు సంధించి పెనాల్టీ వేసే అధికారం సంబంధిత యూనిట్ అధికారికి ఉంటుందని తెలిసింది. ఆడిట్ చేసే సమయంలో పెనాల్టీ వేసే అధికారం ఏ ఏవోకు లేకపోయినా ఆయా బిల్లులపై పెనాల్టీ వేసి కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమా చారం. పలుమార్లు ఈ విషయంపై ఏవోను కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తే... సిబ్బంది కొరత ఉంది, పైస్థాయి అధికారుల వద్దకు వెళ్లి ఒకరిద్దరిని సిబ్బందిని నియమించేలా చూడాలంటూ హేళనగా మాట్లాడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కడప రీజనల్ మేనేజరును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఆర్టీసీ టెండర్ల వ్యవహారంలో జీఎస్టీని ఎప్పటికప్పుడు టెండరుదారులకు అందజేయడం జరుగుతుంది. అయినప్పటికీ ఏమో ఒకసారి మా ఏవో (అకౌంట్స్ క్లర్కు)ను అడిగి చెబుతానని సమాధానమిచ్చారు.

జిల్లా అభివృద్ధికి కలసికట్టుగా పనిచేద్దాం : కలెక్టర్


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సమాచారశాఖ అధికారులు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 1: నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని కలెక్టర్ పీఎస్ గిరీషా అధికారులకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పీఎస్ గిరీషా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ, డీఆర్‌వో సత్యనారాయణలను వారి చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, అనధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలు, పండ్లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా జేసీతో కలిసి కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేకును కలెక్టర్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమిష్టిగా నూతనోత్తేజంతో పనిచేద్దామని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కలెక్టర్‌ను వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ కృష్ణారావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవోలు మురళి, రంగస్వామి, రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో బాలకృష్ణ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌వో పురుషోత్తం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, గృహ నిర్మాణశాఖ పీడీ శివయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, పాత్రికేయులు కలెక్టర్, జేసీ, డీఆర్‌వోలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, పూలమొక్కలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

చంద్రబాబును సీఎంగా చూడాలన్నదే లక్ష్యం


పోరుమామిళ్లలో నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ యువనేత చెరుకూరి రవికుమార్

పోరుమామిళ్ల, జనవరి 1 : నారా చంద్రబాబునాయుడును సీఎంగా చూడాలన్నదే లక్ష్యమని.. అదే తమ ఆశయమని టీడీపీ యువ నాయకులు కమ్మవారిపల్లెకు చెందిన చెరకూరి రవికుమార్ అన్నారు. పోరుమామిళ్లలో సోమవారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఆత్మీ యులకు స్నేహితులకు సన్నిహితులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి జరగబోయే శాసనసభ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. చంద్రబాబు సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురం బాలకిష్ణ, చెన్ను వెంకటరమణ, జీవీ సుబ్బయ్య, ముద్దం నాగేంద్ర, రఫి తదితరులు పాలొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1: ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎస్ఎం డీ ఇలియాస్‌బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కడప నగరం టీటీడీ కల్యాణ మండపంలో 77వ ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమవేశంలో నూతన కార్యవ ర్గాన్ని ఏకగీవ్రంగా ఎన్నుకున్నా రు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఎన్నికల అధికారిగా అనంతపురం జిల్లా అధ్యక్షుడు సూర్యుడు వ్యవహరించారు. జిల్ల ఆర్థిక కార్యదర్శిగా రామ్మోహన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా మల్లు రఘునాథరెడ్డి, కె.సురేష్‌బాబు, బాల గంగిరెడ్డి, గురుకుమార్, ఎస్.దాదాపీర్, పి.రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏవీ సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రషీద్‌ఖాన్‌తో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షులును, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కడప (మారుతీనగర్), జనవరి 1 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న బీసీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పాత రిమ్స్ వద్ద గల బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమూర్తితో పాటు ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు గోవిందు నాగరాజు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన బీసీలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కళ్యా సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రం యాదవ్, ఏవీఆర్ వెంకటేశ్వర్లు, సీఆర్ఐ సునీల్, మునిరత్నంగౌడ్, శ్రీనివాసులు, చేలో రవి, సుబ్బరాయుడు, మహిళా నాయకులు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయానికి పోటెత్తిన భక్తులు


ఒంటిమిట్ట, నందలూరులో క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ఒంటిమిట్ట, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా ఏకశిలా నగిరి కోదండరామాలయానికి పెద్ద ఎత్తున భక్తు లు పోటెత్తారు. వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనం కోసం అనుమతించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, పిల్లలు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో రామాలయంలోని గర్భాలయం నుంచి దక్షిణ ద్వారం బయట వరకు భక్తులతో క్యూలైన్ కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ పెద్ద ఎత్తున క్యూలైన్ ఏర్పాటు చేసింది. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సౌమ్యనాథస్వామి ఆలయానికి...

నందలూరు, జనవరి 1: ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం భక్తులకు పోటెత్తింది. నూతన ఆంగ్ల నామ సంవత్సరం సందర్భంగా తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్నారు.

కన్నుల పండువగా తిరుమలరాయుడు జాతర


ప్రత్యేక అలంకరణలో తిరుమలరాయుడు

సంబేపల్లె, జనవరి 1: నారాయణరెడ్డి పల్లె గ్రామం తిరుమలరాయగుట్టపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి జాతర సోమవారం కన్నుల పండువగా జరిగింది. ప్రతి ఏడాది నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా తిరుమలరాయుడు జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జానపద కళారూపాలు, చెక్కభజనలు అలరించాయి.

వైవీయూ ఏసీఈగా గంగయ్య నియామకం


నియామక పత్రం అందిస్తున్న చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1: వైవీ యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికా రిగా ఎంబీఏ శాఖ అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ గంగయ్యను నియమించారు. ఆదివా రం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధా కర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బ య్య నియామక పత్రాన్ని గంగయ్యకు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పరీక్షల బాధ్యతలను అత్యంత జాగ్ర త్తతో నిర్వహించాలని సూచించారు. ఈ సంద ర్భంగా వైస్ చాన్సలర్ రిజిస్ట్రార్‌లకు గంగయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దూరవిద్య ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా ప్రొఫెసరు పి.రమాదేవి


రమాదేవికి నియామక పత్రాలు అందిస్తున్న రిజిస్ట్రార్

వైవీయూ తెలుగుశాఖలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న పి.రమాదేవిని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా వైస్‌చాన్సలర్ ఆదేశాల మేరకు నియమించినట్లు రిజిస్ట్రార్ వైపీ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఆదివారం వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ తన కార్యాలయంలో ఆమెకు నియామక పత్రాలను అందించారు.

కిటకిటలాడిన శిల్పారామం

● ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్య ప్రదర్శనకు హాజరైన సందర్శకులు

పులివెందుల టౌన్, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది. సోమవారం ఉదయం నుంచి శిల్పారామంలో అశేష జనవాహిని, కుటుంబ సమేతంగా సందర్శించి ఉత్సాహంగా గడిపారు. బంధువులతో వనభోజనాలు ఏర్పాటుచేసుకొని ఆటలు ఆడుకున్నారు. ఊయలలు, బోటింగ్ షికార్లు, చిన్నారుల ఆటవిడుపు యంత్రాలతో ఆడుకుంటూ పిల్లలు,పెద్దలు ఉత్సాహంగా గడిపారు. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ఎస్కే డ్యాన్స్ ఫిల్మ్ స్టూడియో మాస్టర్ శరవణ్ మరియు మనూస్ డ్యాన్స్ అకాడమీ మాస్టర్ మనోహర్ వారి బృందాలతే జానపద, సినిమా పాటలకునృత్య ప్రదర్శన ఇచ్చారు. రాధే తేరే చార్నోకి, బుట్టబొమ్మ, అలుమా డోలుమా, నాటునాటు తదితర పాటలకు చిన్నారులు వేసిన స్టెప్పులకు సందర్శకుల ఈలలు, కేకలతో శిల్పారామం మారుమోగింది. వేల సంఖ్యలో సందర్శకులు రావడంతో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ ఇబ్బంది కలుగకుండా సెక్యూరిటీ తదితర ఏర్పాట్లు చేశారు.

జనసంద్రంగా శిల్పారామం

కడప (కల్చరల్), జనవరి 1 : జనవరి 1 నూతన సంవత్సర సందర్భంగా సోమవారం నగర రిమ్స్ సమీప శిల్పారామం జన సంద్రంగా మారింది. శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమాలకు ప్రేక్షకుల నుంచి కరతాళ ధ్వ నులు అందుకున్నాయి. తిరుణాలను తలపించేలా నగర వాసులు శిల్పారామం చేరుకుని కాసింత సేద దీరారు. సాయంత్రం 5.45 గంటలకు శిల్పారామంలోని సాంస్కృతిక కళావేదిక మీద మిష్పా మూవీ సహకారంతో కడప నగరానికి చెందిన దేవ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు స్టెప్పులు వేసి ప్రేక్షకులను ఎంతగానో ఉత్సాహపరిచారు.



నృత్యం చేస్తున్న దృశ్యం

టీడీపీ ప్రచార రథానికి ప్రత్యేక పూజలు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు వాసు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1: కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డప్పగారి మాధవీరెడ్డి సోమవారం కడప నగరం ద్వారకానగర్‌లో ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. రథానికి ముందుగా పూజలు నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ స్థానికులు

కడప నగరం 38వ డివిజనులో సోమవారం వైసీపీకి చెందిన స్థానిక యువత భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి వారిని పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అలాగే పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. చంద్రబాబును సీఎం చేయాలన్న లక్ష్యంతో కార్యకర్తలంతా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్, అనీఫ్, నస్రుద్దీన్, ఆయుబ్, గౌస్, యాసిన్‌తో పాటు సయ్యద్ ఆరిఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయం

పులివెందుల, జనవరి 1: అర్హులైన ప్రతి ఒక్కరిక సంక్షేమ ఫలాలు అందించడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందుల క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రజలు ఎంపీని కలిసి తమ సమస్యలు తెలియజేసి వినతిపత్రాలు అందించారు. ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు...

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కేఎస్ఎన్ఆర్‌ఘాట్‌లో కేక్‌కట్ చేస్తున్న కళాశాల కరస్పాండెంట్, కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ, ఎండీ చంద్రఓబుళ్‌రెడ్డి(నాని), తదితరులు

సీకేదిన్నె, జనవరి 1: కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో 2024 ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుళరెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరం అందరికీ శుభాలు కలగాలన్నారు. కొత్త ఆశలు, ఆశయాలకు, ఆవిష్కరణలకు, రాష్ట్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలవైపు ముందుకు సాగే విధంగా విద్యార్థుల ఆశయాలు నెరవేరే విధంగా సహకరించాలని అందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.రత్నమ్మ, కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణమోహన్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వప్రగతి చిట్స్‌లో నూతన సంవత్సర సంబరాలు



నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న తుంగా రమణయ్య

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1 : కడప నగరం ఎన్జీఓ కాలనీ విశ్వప్రగతి చిట్ ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు తుంగా రమణయ్య, డైరెక్టరు తుంగ వెంకటేశ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని తెలిపారు. కార్యక్రమంలో శంకరయ్య, వాసుదేవరెడ్డి, ఎన్.సంపత్‌కుమార్, నరసింహులు, కొండయ్యవీర ప్రసాదరెడ్డి, బుజ్జయ్య, కె.చంగయ్య, సత్యనారాయణ, కిరణ్, తిరుపాలమ్మ, వి.శ్రీనివాస్, సుబ్బిరెడ్డి, వేణు, లక్ష్మీపతి, కె.రాజేష్, సుమంత్‌రెడ్డి, సుబ్బారావు, వెంకటరమణ, రెడ్డయ్య, ఎం.రాంప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమల టింబర్ డిపో గోపిక్రిష్ణకు సత్కారం



కంచి గోపిక్రిష్ణను సత్కరిస్తున్న మల్‌రెడ్డి చంద్రశేఖరరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1 : తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపిక్రిష్ణ కార్యాలయంలో సోమవారం వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సాయిపేట శ్రీను ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గోపిక్రిష్ణ చేత కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. శంకరాపురం సింధు, సుబ్బరాయుడు, క్రిష్టారెడ్డి, అప్పా గౌస్‌బాషా, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



వేడుకగా వృషభాచలేశ్వరుడి కల్యాణం



పూజలందుకుంటున్న వృషభాచలేశ్వరుడు

వేంపల్లె, జనవరి 1: నూతన సంవత్సరం పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దలకొండపై వెలసిన వృషభాచలేశ్వర ఆలయంలో స్వామివారిని ప్రత్యేకగా అలంకరించి పూజలుచేశారు. ఆలయంలో వృషభాచలేశ్వరుడి కళ్యాణమహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారిహరిప్రవీణ్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు.చైర్మన్ కురాకుల వెంకటేష్, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేంపల్లెలో జనవరి సందడి

వేంపల్లెలో 2024 నూతన సంవత్సర సందడి కనిపించింది. 31వ తేదీ అర్ధరాత్రి కేకులు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ నరైడ్డి తులసిరెడ్డి, శాసన మండలి మాజీడిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జడ్పీటీసీసభ్యులు రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి తదితరులకు వారి అభిమానులు, మిత్రులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్త ఏడాదిలో పీడ తొలగిపోవాలి: టీడీపీ

చెన్నూరు, జనవరి 1 : కొత్త ఏడాదిలో అయినా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న పీడ తొలిగిపోవాలని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి అన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా చెన్నూరు పాతబస్టాండులో టడీపీ నేతలు కేక్ కట్ చేసి ప్రజలకు నూతన సంంత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, రైతు విభాగం జిల్లా కార్యదర్శి లేవాకు శివారెడ్డి, కొక్కిరాయపల్లె సర్పంచ్ సూరి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఆర్.సుధాకరరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

పెండ్లిమర్రి, జనవరి 1: మండల కేంద్రమైన పెండ్లిమర్రిలో మంగళవారం మధ్యాహ్నం బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి హాజరవుతారని కావున మండలంలోని పార్టీ నాయకులు,కార్యకర్తలు, టీడీపీ కమిటీ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

సేవా సంస్కృతి రక్షణే ధ్యేయం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఇంటాక్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1: తమ సంస్థలు ఉమ్మడిగా సేవా సంస్కృతిక వారసత్వ సంపదలను రక్షించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయని జిల్లాకు నంది అవార్డులు సాధించి పెట్టిన కళాకారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి నంది నాటక పోటీల్లో జిల్లాకు చెందిన వైవీయూ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసరు మూలమల్లికార్జున నరెడ్డి. సీనియర్ నాటక దర్శకులు పల్లేటి లక్ష్మి కులశేఖర్‌లను సోమవారం ఘనంగా సత్కరించారు. కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీకార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలోఇంటాక్ జిల్లా కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచరెడ్డి సుబ్బారెడ్డి, పూర్వకన్వీనరు ఇలియాస్ రెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, రెడ్డిశేఖర్‌రెడ్డి, బాగొండు గంగాధర్, కొనిశెట్టి శ్రీనివాసులు, పద్మప్రియ చంద్రారెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మేలు జరగాలి

కడప (కల్చరల్), జనవరి 1 : నూతన సంవత్సరం 2024లో జిల్లా ప్రజలకు మంచి జరిగేలా ఆ భగవంతుడు కరుణ చూపాలని సంఘ సేవకుడు సలావుద్దీన్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్పీని కోరారు.

అయోధ్య రాముడి అక్షింతలతో ర్యాలీ

పెండ్లిమర్రి, జనవరి 1: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలతో మండలంలోని నందిమండలం గ్రామంలో హిందూ ఐక్యవేదిక ప్రతినిదుల ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా డప్పు వాయిద్యాల మధ్య రాముడి అక్షింతలను కడప-పులివెందుల ప్రధాన రహదారిపై, అలాగే గ్రామంలోని ప్రధాన వీదుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ హిందూ బంధువులందరు అయోధ్య రాముడి అక్షింతలు ఇంట్లో ఉంచుకొని పూజా కార్యక్రమంలో ఉపయోగించుకోవాలన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న మహేష్ తదితరులు

కడప (కల్చరల్), జనవరి 1 : నూతన సంవత్సరంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండేలా యేసుప్రభు కరుణ చూపాలని న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు, పాస్టర్ పి.మహేష్ కోరారు. నూతన సంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకుని కడప నగరం 48వ డివిజన్ కృపా కాలనీలో గల న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం నిరుపేదల మధ్య కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ గంగాదేవి, బంగారు నాగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి కేక్‌కట్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, వలస కూలీలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ముఖ్యంగా యువత మాదక ద్ర వ్యాలకు, చెడు వ్యసనాలకు దూరమై తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కృష్ణస్వామి, విమల, రవితేజ, శాంతిరాజ్, రాముడు, రోజా, నందిని, మాదేవి, జాన్, నరసయ్య తదితరులతో పాటు పట్టణ నలుమూలల నుంచి పలువురు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప (నాగరాజుపేట), జనవరి 1: యువత చెడుమార్గాలపై ప్రభావం చూపుతుందని అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి అన్నారు. సోమవారం ఉదయం కడప అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద 2024 క్యాలెండరును ఆవిష్కరించారు. ప్రతి మనిషికి క్యాలెండరు నిత్య జీవితంలో చాలా ముఖ్యమైనదన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత చెడు మార్గాల వైపు చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. యువత దేశంలో నిరుద్యోగం ఉండడం వల్ల డ్రగ్స్, మత్తు పానీయాలకు అనేక చెడు మార్గాల్లో యువత పయనిస్తోందన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తునే యువతలో సాంస్కృతిక సామాజిక శాస్త్రీయ విజ్ఞానం కల్పించాలని అందుకు యువత సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అలాగే నిరుద్యోగులు కావడం వల్లనే యువత ఎక్కువగా 20 ఏళ్ల నుండి చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. కావున ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పారదోలే విధంగా ఉంటే యువత చెడు మార్గాల నుంచి బయట పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి అంజనీదేవి, డీవైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, స్టీఫెన్, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, వెంకటసుబ్బయ్య క్యాలెండరు ఆవిష్కరించిన వారిలో ఉన్నారు.



ఉత్సాహంగా ఆంగ్లసంవత్సర వేడుకలు

ప్రొద్దుటూరు,జనవరి 1 : ఆంగ్ల నూతన సంవత్సర సంబరాలను టీడీపీ నేతలు తమ కార్యాలయాల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. నెహ్రూరోడ్డులోని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కార్యాలయానికి శుభాకాంక్షలు తెలపడానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కదలివచ్చారు. టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు వరదరాజులరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల కొండారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి,మాజీ ఎంపీపీలు ,మాజీ కౌన్సిలర్లు ,మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. అన్నా క్యాంటీన్‌లో సీఎం సురేష్ నాయుడుకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, మాజీ మున్సిపల్‌కౌన్సిలర్లు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్ రెడ్డి తన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యకర్తలు పెద్దఎత్తున ప్రవీణ్‌రెడ్డిని కలిసి పూల గుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు.మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జబీవుల్లా మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

రాజుపాలెం..: ఆంగ్ల సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు చిన్నశెట్టిపల్లెకు మాజీ ఎంపీపీ మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డి ని పూలమాలలతో ముంచెత్తారు. ఆయన స్వగృంలో ఉదయం నుంచి అభిమానుల రాకతో సందడిగా మారింది. అక్కడికి వచ్చిన వారికి విందు భోజనం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య గుత్తి దస్తగిరి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌బొజ్జ రోశన్న ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు జరిపారు. సోమవారం ఆమెకు పోరుమామిళ్లలోని టీడీపీ కార్యాలయంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, మార్కెట్ యార్డు మాజీఛైర్మన్లు చెరుకూరి చెన్నరాయుడు, సాదనకారి రంతు, హబీబున్నీసా, సీతా వెంకటసుబ్బయ్య, సీతాబాలాజీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్విరెడ్డి, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కొండా రామక్రిష్టారెడ్డి, ఇమాంహుసేన్, కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, సెట్టెం ప్రతాప్, పాణ్యం వెంకట సత్యం, తిరుమలశెట్టి సుబ్బారావు, మస్తాన్ రంతుల్లా, జిలానీలతో పాటు నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆంగ్ల నూతన సంవత్సరం 2024 వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గంలోని జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం ప్రాంతాల టీడీపీ అభిమానులు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు దేవగుడి గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఉదయాన్నే టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభిమానులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

కొండాపురం..: మండలంలో ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే మండలంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ కార్యలయంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్ రెడ్డికి మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గోరుశెట్టిబాబు,కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలపారు.

బద్వేలు..: బద్వేలు డివిజన్ వ్యాప్తంగా శనివారం న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, కొంకుల రాంబాబు, జహంగీర్ బాష, నరసింహనాయుడు, నేతలు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రొద్దుటూరులో వరదరాజులరెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం సురేశ్‌నాయుడు, ప్రవీణ్‌రెడ్డికి కార్యకర్తల శుభాకాంక్షలు, సురేష్ నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీనేతలు

కాశినాయన..: ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ,బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జారోశన్న పలువురు జ్యోతిక్షేత్రంలో కాశినాయన సమాధిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి,కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి ఆధ్వర్యంలో జ్యోతిక్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మతో కేక్ కట్‌చేయించారు.ఈకార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు ఓ.రోహిత్‌రెడ్డి,బి.నరసింహారెడ్డి,డి.క్రిష్టారెడ్డి,ఉస్సేన్,హోండా రవీద్రారెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట..: రానున్న మూడు నెలల్లో మార్పు వచ్చి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. సోమవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని ఖాజీపేట నాయకులతో కలిసి మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫరూక్, గోవిందు సుబ్బయ్య, జిలానీ, జానకిరాం, హరినాథరెడ్డి, హబీబ్, జెండాల మాబాష, పిచ్చినాయుడు, ఖదీరుల్లా, భాస్కర్‌రెడ్డి, నరసింహ, వీరయ్య, కృష్ణారెడ్డి, గౌస్, పల్లె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: బి.కోడూరు మండలం టీడీపీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రోశన్న, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, ఓ.రమనారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, నారాయణరెడ్డి, బాలయ్య శ్రీనివాసుల రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పరిటాల వెంకటసుబ్బయ్య, పవన్, వీర రాఘవరెడ్డి, బాల లింగారెడ్డి , నరసింహారెడ్డి, కేశవ, దుగ్గిరెడ్డి, మద్దిరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో కేక్ కట్ చేస్తున్న విజయమ్మ తదితరులు



జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న భూపేశ్‌రెడ్డి



పుట్టా సుధాకర్ యాదవ్, రాజుపాళెం మాజీ ఎంపీపీ మెట్టుపల్లి ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రేషన్ తూకం తక్కువ ఇస్తే చర్యలు

జమ్మలమడుగు, జనవరి 1: జమ్మలమడుగు పట్టణంలో సోమవారం ఉదయాన్నే ఆర్డీవో శ్రీనివాసులు, సిబ్బంది పలు వీధుల్లో తనిఖీలు చేపట్టారు. జగనన్న వాహనాల్లో అందించే రేషన్ బియ్యం పంపిణీ తూకాలు తక్కువగా ఇస్తున్నారని, కొన్ని చోట్ల బియ్యం సక్రమంగా పంపిణీ చేయడంలేదని, ఒక చోట నిలబెట్టి ఇంటింటికి రాకుండా బియ్యం పంపిణీ చేస్తున్నారని, రెవెన్యూ అధికారులకు ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. వెంటనే ఆర్డీవో శ్రీనివాసులు రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాల వద్ద తనిఖీ చేశారు.

ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ



బుట్టలు పంపిణీ చేస్తున్న గుణవంత్‌రెడ్డి

ముద్దనూరు జనవరి1: ఎల్ఎం కాంపౌండ్, ఎస్వీగిరి కాలనీలోని కుటుంబాలకు సోమవారం మండల బీజేపీ నాయకులు కె.మధుసూదనరెడ్డి తనయుడు గుణవంత్ రెడ్డి నూతన సంవత్సరం సందర్భంగా ప్లాస్టిక్ బుట్టలు ఉచితంగా అందజేశారు.దాదాపు 700కుటుంబాలకు ఇంటింటికీ వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ బుట్టలు అందజేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, దానం, వెంకటాద్రి, గఫూర్, సుబ్బరాయుడు,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సేవాశ్రమానికి రూ.50వేలు వితరణ

కాశినాయన జనవరి 1: ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమానికి సోమవారం గొంటువారిపల్లెకు చెందిన వేములకోట బాలుడు (రిటైర్డ్ ఆర్మీఉద్యోగి)రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా బాలుడు మాట్లాడుతూ ఇటీవల పదవీవిరమణ చేసినప్పటికీ రిటైర్మెంట్ ఫంక్షన్ చేసుకోకుండా అందుకు అయ్యేఖర్చును వివేకానంద సేవాశ్రమానికి విరాళంగా ఇచ్చానన్నారు. వివేకానంద సేవాశ్రమ నిర్వాహకులు రామక్రిష్టారెడ్డి,రామతులసి మాజీ సైనికుడు బాలుడిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

పలువురు టీడీపీలో చేరిక

ముద్దనూరు జనవరి1:మండల పరిధి మంగపట్నం గ్రామంలో సోమవారం పలు కుటుంబాలు జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.బోడెద్దుల వెంకట్రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులకు భూపేశ్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, జగదీశ్వరరెడ్డి, కేశవరెడ్డి, శేఖర్‌నాయుడు,పురుషోత్తం టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై నిర్లక్ష్యం తగదు

జమ్మలమడుగు, జనవరి 1: జమ్మలమడుగులో ఆర్టీసీ డిపో గ్యారేజీ గేటు ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు, కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి హెచ్చరికలు చేశారు. సోమవారం 2024 ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎన్ఎంయూ కార్మికులు, నాయకులు సమావేశం అయ్యారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కార్మిక నేతలకు కార్మికులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్యారేజీ గేటు ఎదుట సమావేశంలో ఎన్ఎంయూ రీజినల్ కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కార్మిక సమస్యలపై మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం, యాజమాన్యంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మం, శేషన్న, శివుడు, నూర్‌బాష, గ్యారేజీ కార్మికులు వల్లి, తదితరులు పాల్గొన్నారు.

చెప్పులు కుడుతూ కార్మికుల నిరసన

బద్వేలు, జనవరి 1 : జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం బద్వేలు మున్సిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ చెప్పులు కుడుతూ వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. కార్మికుల సమ్మెకు సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు గౌతమి, అనంతమ్మ, చిన్ని రాజగోపాల్, పులిశ్యాం, హరి,దేవమ్మ, నాగేంద్రబాబు, సత్యరాజు, ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



జమ్మలమడుగులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

జమ్మలమడుగు, జనవరి 1: జమ్మలమడుగులో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె ఉధృతంగా మారింది. సోమవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉదయాన్నే శిబిరం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, నరసమ్మ, నాగలక్ష్మి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: అంగన్వాడీ కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వినోదాదేవి తదితరులుపాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో భాగంగా సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, మున్సిపల్ కౌన్సిలర్లు మిత్తికాయల సునీతయాదవ్, మహ్మద్ హసన్‌లు వారికి సంఘీభావం తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాగేంద్రబాబు, ముడియం చిన్ని, ఖదీరయ్య, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరు..: ఆటపాటల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు వినూత్నంగా సోమవారం మైదుకూరులో నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను ఆడిస్తూ చదువు చేప్పేవాళ్ళమని, ఇప్పుడు జగనన్నా మమ్మల్ని రోడ్డుకు ఈడ్చి ఆటలాడిస్తున్నారంటూ కోలాటం ఆడారు.

కొండాపురం..: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు 21వ రోజు సోమవారం కొండాపురంలో తమ నిరసనను కొనసాగించారు. జగన్ చిత్రపటం చేతపట్టి పాటలు ఆటాపాటతో తమ నిరసనను కొనసాగించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ

ఎర్రగుంట్ల, జనవరి 1: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన అక్షింతలను ఎర్రగుంట్లలో ఇంటింటికీ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు భజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్, నడివూరు శ్రీరామాలయ కమిటీ వారు తెలిపారు. సోమవారం ఉదయం నడివూరులోని శ్రీరామాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్, నడివూరు రామాలయం కమిటీకి చెందిన చరణ్, రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, రామచంద్రారెడ్డి, ఉమాదేవి, వాసు, శ్రీనివాసరెడ్డి,మాజీ వార్డు మెంబర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, జి. రామసుబ్బారెడ్డి, జి.మధు, మల్లికార్జునరెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

మైదుకూరు రూరల్..: జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ చిన్న, పెద్ద అందరూ వీధుల వెంట ఆదివారం సందడి చేశారు. స్థానిక పాతూరులోని శ్రీరామ భక్త బృందం అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నూతనంగా నిర్మిస్తున్న బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శ్రీరామ అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. అందులో భాగంగా పాతూరులోని భక్త బృందం ఇంటింటికీ అక్షింతలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో పాతూరులోని శ్రీరామ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కొండాపురం, జనవరి 1 :ప్రస్తుత పంటబీమా వల్ల రైతులకు ఉపయోగం లేదని, దీనివల్ల చాలా మంది రైతులు నష్టపోతున్నారని కడప పార్లమెంటు తెలుగురైతు అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు తెలిపారు. కొండాపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటలబీమా అందకుండా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఏదో విధంగా ఆదుకోవాలన్నారు.